# పీసీసీకి పాఠశాల స్థలమా?

## పార్కు అన్నారు... ఇళ్లన్నారు... పార్టీకిచ్చారు ★ ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర నిరసన



త్రిశూల్‌పార్కు పాఠశాల వద్ద తెదేపా నాయకుల నిరసన




1950లో పాఠశాలను ప్రారంభించినప్పటి శిలాఫలకం

హైదరాబాద్ - న్యూస్‌టుడే

సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారంలో రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి పదెకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాలుగా ప్రజాప్రయోజనం కోసం ఉపయోగిస్తున్న స్థలాన్ని అధికార పార్టీ శిక్షణ కార్యాలయానికి ఇవ్వడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపాదిత స్థలంలో త్రిశూల్ పార్కు, పాఠశాలలు, కళాశాలలు, క్రీడామైదానం ఉండడంతో వాటిని ఎట్టిపరిస్థితుల్లో వదులుకోబోమని చెబుతున్నారు. మొన్నటి వరకు గృహసముదాయానికి కేటాయిస్తున్నట్లు చెప్పి ఇప్పుడు పీసీసీకి కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిటీష్ పాలన కాలంలో త్రిశూల్ పార్కు స్థలాన్ని సైనికుల గుర్రాలను పెంచేందుకు ఉపయోగించేవారు. వాటికి సంబంధించిన షెడ్లు, వసతులు, ఒక గుర్రం సమాధి ఇప్పటికీ ఉన్నాయి. దీంతో పాటు అప్పటి జైలు, సెల్ చెక్కు చెదరకుండా ఉన్నాయి. జైలును ప్రస్తుతం బొల్లారం పోలీస్‌స్టేషన్‌గా ఉపయోగిస్తుండగా సెల్ నిరుపయోగంగా ఉంది. గుర్రపు షెడ్లను తరగతి గదులుగా మార్చి త్రిశూల్‌పార్కు ఉన్నత పాఠశాలగా కొనసాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇందులో నాలుగు ఎకరాలను 1950లో అప్పటి సబ్ ఏరియా కమాండర్ పాఠశాల కోసం కేటాయించారు. దీనికి సంబంధించిన ప్రారంభోత్సవ శిలాఫలకం ఇప్పటికీ ఉంది. ఈ స్థలంలో ఒకటిన్నర ఎకరంలో ప్రాథమిక పాఠశాలను, రెండున్నర ఎకరాల్లో ఉన్నత పాఠశాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ పాఠశాలకు ఆనుకొనే 1932 నుంచి మరో స్కూలు కొనసాగుతోంది. నగరంలో ఎక్కడా లేని విధంగా విశాలమైన భవన సముదాయంతో కొనసాగుతున్న ఈ పాఠశాలలోనే 40 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా నడుపుతున్నారు. దీనికి ఎదురుగా ఎకరంపైన స్థలంలో క్రీడామైదానం ఉంది. ఇవన్నీ 510, 511, 97 జీఎల్‌ఆర్ సర్వే నెంబర్లలో ఉన్నాయి. దీన్నే ప్రభుత్వం పీసీసీకి కేటాయించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న త్రిశూల్ పార్కు స్థలాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ స్థలాన్ని పట్టణ పునరుద్ధరణ కార్యక్రమం కింద గృహ సముదాయానికి కేటాయిస్తున్నట్లు జూన్‌లో చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు పార్టీ కోసం ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు తెదేపా ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు పాఠశాల వద్ద తెదేపా నేతలు నిరసన తెలిపారు. పీసీసీకి స్థలం కేటాయింపుపై తిరుమలగిరి అధికారులను వివరణ కోరగా తమకు తెలియదని చెబుతున్నారు. కనీసం ఆ స్థలాల సర్వే నంబర్లను అడిగినా దాటవేస్తున్నారు. త్రిశూల్ పార్కు విస్తీర్ణం గురించి చెప్పడానికీ తమ వద్ద రికార్డులు లేవని చెప్పడం గమనార్హం.